
కథ

సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలు కావస్తోంది. అప్పటి వరకు ఆయాసంతో రొప్పుతూ పరుగులు తీసిన భానుడు మధ్యాహ్న మార్తాండుడిగా మారిన విజయగర్వంతో చంద్రనిప్పులు చెరుగుతున్నాడు.

# రిజర్వేషన్

వేంపల్లి రెడ్డి నాగరాజు



వివిధ ప్రాంతాల నుండి వచ్చే వాళ్ళు, వివిధ ప్రాంతాలకు వెళ్ళే ప్రజలతో నియోజకవర్గ కేంద్రంలోని ఆ బస్టాండు ఎంతో రద్దీగా ఉంది. ఓ వైపు పల్లీలమ్ముకొనే కుర్రాళ్ళ అరుపులు, తోపుడు బళ్ళ వ్యాపారుల కేకలు, టిఫిన్ సెంటర్ల నుండి వినిపిస్తున్న లేటెస్ట్ రిలీజ్ సినిమాల పాటలతో బస్టాండు పరిసరాలు మార్మోగుతున్నాయి. మరోవైపు బస్టాండు ప్రాంగణంలోకి వచ్చే పోయే బస్సులు, స్కూటర్లు, ఆటోల హారన్ల రణగొణ ధ్వనులతో ఆ ప్రాంత మంతా హోరెత్తిపోతోంది.

ఉదయం పదిన్నర గంటలకే రావల్సిన బస్సు గంటన్నర ఆలస్యంగానైనా రాకపోవడంతో అప్పటి వరకు ఎంతో ఓపికగా తాను వెళ్ళాల్సిన బస్సు కోసం వేచి చూస్తున్న సుబ్బారావుకు కాస్తంత విసుగ్గా ఉంది. అసలే వేసవి కాలం, ఆపై రోళ్ళు పగిలేలా కాస్తున్న ఎండవేడిమి మూలంగా ఏ మాత్రం గాలి ఆడక ఉక్కపోతగా వుంది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోతుండడమే గాక దాహంతో నాలుక పిడుచకగట్టుకుపోతుండడంతో త్రాగునీటి కోసం ఎదురుగా వున్న కుళాయిల వైపు చూశాడు సుబ్బారావు.

బస్టాండు ఆవరణలో 'త్రాగునీరు' అనే అక్షరాలున్న చోట కుళాయిలైతే వున్నాయిగానీ అందులో నుండి చుక్క నీరు కూడా వచ్చే జాడ ఏమాత్రం కనిపించలేదు. దీంతో తను కూర్చొని వున్న బెంచీకి ఆనించి వున్న చేతి కర్రను ఎడమచేతి చంక క్రిందుగా అసరాగా చేసుకొని నిలబడి అక్కడే వున్న దుకాణాల సముదాయాలవైపు వెళ్ళాడు.

"ఏమండీ ఓ వాటర్ ప్యాకెట్ ఇస్తారా?" అని అడిగాడు చేతిలోని రూపాయి నాణేన్ని అంగడి వాడికి అందిస్తూ.

"మరో అర్ధ రూపాయి ఇవ్వండి సార్" అన్నాడు దుకాణదారుడు.

'వాటర్ ప్యాకెట్ ఒక్క రూపాయే కదా?" ప్రశ్నించాడు సుబ్బారావు.

"ఆర్టీసి బస్టాండులో దుకాణం పెట్టుకోవాలంటే వేలంపాటలో అందరికంటే ఎక్కువగా పాడాల్సివుంటుంది. బయటి అంగళ్ళలో మాదిరి అమ్మితే ఏమి గిట్టుబాటుకాదు" బదులిచ్చాడు అంగడివాడు. ఆర్టీసి బస్టాండులో అమ్మే సరుకు ధర కాస్త ఎక్కు వగానే ఉంటుందన్న విషయం కూడా ఆమాత్రం తెలియదా అన్న భావాన్ని వ్యక్తం చేస్తూ.

అవసరం తనది కావడంతో వాదించే ఓపిక లేక మరో రూపాయి నాణేన్ని అందిస్తూ.

"కాస్తంత కూల్‌గా వున్న ప్యాకెట్ ఇవ్వమని" అడిగాడు సుబ్బారావు.

రూపాయి నాణేలు రెండింటిని 'గల్లా' పెట్టెలో వేసుకొన్న అంగడివాడు వాటర్ ప్యాకెట్‌తో పాటు మరో చాక్లెట్ కూడా సుబ్బారావు చేతిలో పెట్టాడు.

"చాక్లెట్ ఇవ్వమని నేను అడగలేదు కదయ్యా?" అడిగాడు సుబ్బారావు.



"మిగిలిన చిల్లర ఇవ్వడానికి అర్ధరూపాయలు లేవు, పావలా నాణేలు, పది పైసలు, ఐదు పైసల బిళ్ళలు చలామణీలో లేకపాయె, అందుకనే మీకు వాపసు ఇవ్వాల్సిన చిల్లర ఖరీదు చేసే చాక్లెట్ ఇచ్చాను'' బదులు చెప్పాడు అంగడివాడు.

చేతిలోని వాటర్ ప్యాకెట్ ఏమాత్రం చల్లగా లేకపోవడంతో "అదేంటయ్యా నీళ్ళు ఏమాత్రం చల్లగా లేవే, ధర ఎక్కువగా తీసుకొన్నా సరుకు అడిగినట్లు ఇవ్వకుంటే ఎలా?'' మళ్ళీ ప్రశ్నించాడు.

"ఉదయం నుండి కరెంట్ లేదండీ, మమ్మల్ని ఏం చేయమంటారు? మీరు చేసే రూపాయన్నర వ్యాపారానికి ఇన్ని సమాధానాలు, వివరణలు చెప్పాలా?''

ఈసారి కాస్త విసుగును ప్రదర్శించాడు అంగడివాడు.

గత్యంతరం లేక తడారిపోతున్న నాలుకను ఆనీటితోనే తడుపుకొని దాహం తీర్చుకున్నాడు సుబ్బారావు.

నీళ్ళు గొంతులోకి దిగడంతో ప్రాణం కాస్తంత లేచి వచ్చినట్లయింది.

చేతి వాచి వంక చూసుకొన్న సుబ్బారావు సమయం పన్నెండున్నర గంటలు కావస్తున్న విషయం గ్రహించి తాను ఎదురుచూస్తున్న బస్సు ఎప్పటికి వస్తుందో తెలుసుకొనేందుకు చంకలోని చేతికర్రను బలంగా నేలకు తాటిస్తూ మెల్లగా ఎంక్వయిరీ కౌంటర్ వైపు అడుగులు వేశాడు.

"ఏమండీ అగ్రహారం వెళ్ళే బస్సు పదిన్నర గంటలకే రావాల్సి వుండగా ఇప్పటి వరకు రాలేదు, మరెంత సేపటికి రాగలదో చెబుతారా?'' కౌంటర్‌లోని ఉద్యోగిని ప్రశ్నించాడు సుబ్బారావు.

తన ఎదురు సీట్లో కూర్చునివున్న మరో ఉద్యోగితో యూనియన్ ఇచ్చిన సమ్మె నోటీసు, వేతన సవరణ, కార్మికులపై యాజమాన్యం వ్యవహరిస్తున్న మొండివైఖరి వంటి అంశాలపై చర్చలో మునిగివున్న ఆ ఉద్యోగి "మరో పది నిమిషాల్లో వస్తుందిలే వెళ్ళవయ్యా '' అన్నాడు చిరాగ్గా మొహంపెట్టి.

బస్సు వచ్చేంతవరకు వేచివుండక తప్పదను కుంటూ మళ్ళీ తన యథాస్థానానికే వచ్చిన సుబ్బారావు ఇంతకు మునుపు తనొక్కడే కూర్చొనివున్న బెంచీపై మరో ప్రయాణికుడు కూర్చొని వుండడంతో కాస్తంత సర్దుకొని అతడి ప్రక్కనే కూర్చున్నాడు.

ఆ ప్రయాణికుడు సుబ్బారావు వైపు ఓసారి నిశితంగా గమనించి "ఎక్కడికెళ్ళాలండీ మేస్టారు?'' అంటూ మాటకలిపాడు.

తను వెళ్ళాల్సిన ఊరు, ఎదురు చూస్తున్న బస్సు ఇంతవరకు రాకపోవడం గురించి చెప్పాడు సుబ్బారావు.

తన పేరు మధుసూదన్‌గా పరిచయం చేసుకొన్న ఆ వ్యక్తి "మరో పావుగంటలో రానున్న బస్సులో తన మిత్రుడు వస్తున్నాడని, అతడిని "రిసీవ్'' చేసుకొనేం దుకు బస్టాండుకు వచ్చినట్లు చెప్పాడు.

"మీరేం చేస్తారండీ?'' మళ్ళీ తనే ప్రశ్నించాడు మధుసూదన్ సుబ్బారావు కాలు వంక గమనిస్తూ.

"మాది ఇక్కడికి వంద కిలోమీటర్ల దూరంలోని క్రిష్ణాపురం సార్, పదిహేనేళ్ళపాటు మిల్టరీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాను, భార్యాపిల్లలతో కలిసి పుట్టిపెరిగిన ఊళ్ళోనే ఉంటున్నాను.'' చెప్పాడు సుబ్బారావు.

ఇద్దరి మధ్య కొంతసేపు మౌనం తరువాత మధుసూధన్ తన కాలువంకే గమనిస్తున్న విషయాన్ని గ్రహించిన సుబ్బారావు మళ్ళీ తనే సంభాషణ కొనసాగించాడు.

కార్గిల్ యుద్ధ సమయంలో శత్రుసైనికుడి బుల్లెట్ దెబ్బతగిలి సకాలంలో చికిత్స లభించక ఆపరేషన్ చేసి కాలు తీసివేయాల్సి వచ్చిందని చెప్పాడు. వున్న ఒకే కాలుతో ఇక సర్వీసుకు పనికి రానన్న ఉద్దేశ్యంతో తనే స్వచ్ఛంద పదవీ విరమణ కోరుకున్నట్లు కూడా చెప్పాడు.

ఆ విషయాలు చెబుతున్నప్పుడు కళ్ళనిండా నీళ్ళు చిప్పిల్లి గొంతు బొంగురుపోయింది.

"ఇంతకీ మీరు అగ్రహారం ఎందుకు వెడుతు న్నారో తెలుసుకోవచ్చా?'' అడిగాడు మధుసూదన్ కుతూహలంగా.

"మా అమ్మాయి పెళ్ళి కుదిరిందండీ, అబ్బాయి ఎల్.ఐ.సి.లో క్లర్క్‌గా పని చేస్తాడు, ముహూర్తాలు కూడా నిశ్చయమయ్యాయి, ఈ నెల పద్నాలుగునే పెళ్ళి, అత్యవసర పనిపై వియ్యంకుడిని కలిసేందుకు వెడుతున్నాను.'' చెప్పాడు సుబ్బారావు లోపలి వైపు నుండి ఉబ్బుకొచ్చినట్లుగా ఎత్తుగా వున్న చొక్కా జేబుపై చెయ్యి పెట్టి తడుముకొంటూ.

"ఎల్.ఐ.సి ఉద్యోగిని అల్లుడిగా చేసుకో బోతున్నారు సంతోషమండీ, మీ మిగతా కుటుంబ సభ్యుల గురించి చెప్పనే లేదు'' అడిగాడు మధుసూదన్.

"పెళ్ళి కుదిరిన అమ్మాయి కాక ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదివే మరో అమ్మాయి, ఎనిమిదవ తరగతి చదివే అబ్బాయి ఉన్నారండీ'' చెప్పాడు సుబ్బారావు.

"పొలాలేమైనా ఉన్నాయా?'' మళ్ళీ ఆసక్తిగా అడిగాడు మధుసూధన్.

"ఓ నాలుగెకరాలు ఉన్నమాట వాస్తవమే గానీ, వర్షాలు సరిగ్గా కురవక సేద్యం అటకెక్కిందండీ'' చెప్పాడు సుబ్బారావు బరువుగా నవ్వుతూ.

"మరి మీ జీవనాధారమెలాగండీ?''


"ప్రతినెలా వచ్చే పెన్షన్ రాళ్ళకు తోడుగా నాలుగు పాడిగేదెలతో వచ్చే రాబడి ద్వారా సంసార శకటాన్ని నెట్టుకొని వస్తున్నా'' వివరించాడు సుబ్బారావు.

ఈలోగా ప్లాట్‌ఫాం వద్దకు ఓ బస్సు రావడంతో తన మిత్రుడు వచ్చే బస్సు అదేనని చెప్పి సుబ్బారావు వద్ద సెలవు తీసుకొని హడావుడిగా వెళ్ళిపోయాడు మధుసూదన్.

మళ్ళీ ఒంటరి వాడు కావడంతో మరోసారి బస్సు గురించిన ఆలోచనలే ముసురుకున్నాయి సుబ్బారావు మెదడుచుట్టూ. ఉదయం పల్లె నుండి ఇక్కడికి వచ్చి అగ్రహారం వెళ్ళే బస్సును సకాలంలో అందుకోకుంటే ప్రయాణం మరుసటిరోజుకు వాయిదా పడుతుందన్న ఉద్దేశంతో తొందరగా బయలుదేరడం మూలంగా సుబ్బారావు ఇంటివద్ద కనీసం టిఫిన్ కూడా చేయలేదు. దీంతో కడుపులో ప్రేవులు అరుస్తున్నట్లుగా అనిపించింది. బస్సు వస్తే మరో గంటన్నర లోగా వియ్యంకుడి ఊరు చేరుకొని అక్కడే భోం చేయవచ్చుని ఆత్మారాముడికి సర్దిచెప్పుకున్నాడు.

సమయం 'ఒంటి గంట' అయ్యిందన్నట్లుగా పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీ సైరన్ కూత వినిపించడంతో తాను ఎదురుచూస్తున్న బస్సు వస్తుందా లేక ఆ సర్వీసును ఏ కారణం చేతనైనా రద్దు చేశారా? అనే సందేహం కలిగి ఆ విషయాన్ని ధృవీకరించుకునేందుకు చేతికర్ర సహాయంతో మరోసారి కౌంటర్ వైపు అడుగులు వేశాడు.

"అగ్రహారం వెళ్ళే బస్సు మరో పది నిమిషాల్లో వస్తుందని గంట క్రితమే చెప్పారు, పదిన్నరకే రావల్సిన బస్సు ఇంతవరకూ రాలేదు, కారణమేమైనా వుంటుందండీ?'' అడిగాడు సుబ్బారావు కౌంటర్లోని



ఓ ఉద్యోగిని. చేతిలో వున్న సినిమా పత్రికను తిరగేస్తున్న ఉద్యోగి "నీకెన్నిసార్లు చెప్పాలయ్యా, మరో పదినిమిషాల్లో వస్తుందని ఇదివరకే చెప్పాగా?" విసుక్కున్నాడు సుబ్బారావు వైపు నిర్లక్ష్యంగా చూస్తూ.

"ఎప్పుడు అడిగినా పదినిమిషాలనే చెబుతున్నారేమిటండీ?"

ఈసారి తనూ స్వరం పెంచి అడిగాడు సుబ్బారావు.

"బస్సు సకాలంలో ఎందుకు రాలేదో చెప్ప డానికి నేనేమైనా జ్యోతిష్యుడినా? అడిగేవాడికి చెప్పే వాడు లోకువ అన్నట్లుగా ఉద్యోగస్తులంటే అందరికీ లోకువయిపోయింది" రుద్రతాండవమే చేశాడు ఉద్యోగి.

"ప్రయాణీకులే మన సంస్థకు నిధి - వారిని గౌరవించడం మన విధి"అని ఎంక్వయిరీ కౌంటర్ గదిలోని తెల్లటి గోడపై ఎర్రగా మెరుస్తూ కనిపిస్తున్న ఆర్టీసి వారి 'స్లోగన్' చూసి కౌంటర్‌లోని ఉద్యోగి తనపట్ల ప్రవర్తించిన తీరు గుర్తురాగా తనలో తనే నవ్వుకుంటూ మళ్ళీ యథాస్థానానికి వెళ్ళి కూర్చున్నాడు సుబ్బారావు.

ఈలోగా తను ఎదురుచూస్తున్న బస్సు నిండు గర్భిణిలా మెల్లగా బస్టాండులోకి వచ్చి చేరింది. చంకలోని ఊతకర్ర బలంగా తాటిస్తూ కాస్తంత వేగంగానే కుంటుకుంటూ బస్సు వైపు వెళ్ళాడు సుబ్బారావు.

ఓ వైపు బస్సులో నుండి దిగేవాళ్ళు, మరో వైపు బస్సులోనికి ఎక్కేవాళ్ళు ఒకరికొకరు ఎవరికివారే త్రోసుకుంటుండగా కండక్టరు ఇవ్వాల్సిన చిల్లర కోసం మరికొందరు డోరు వద్దనే నిల్చుండిపోవడంతో అందరికీ ఇబ్బందిగానే ఉంది.

మరికొంతమంది ప్రయాణీకులు జేబు రుమాళ్ళను, న్యూస్‌పేపర్లను కిటికీల గుండా విసిరి సీట్లను 'రిజర్వ్' చేసుకొనేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఆ త్రొక్కిసలాటలోనే అందరితో పాటుగా ఎలాగోలా బస్సులోకి ప్రవేశించగలిగాడు సుబ్బారావు.

సీట్లలో కూర్చొని వున్నవారికంటే సీట్లు దొరక్క నిల్చుని వున్నవారి సంఖ్య ఎక్కువగా వుంది.

బస్టాండులోని మరో డ్రైవర్‌తో మాట్లాడుతూ సిగరెట్ దమ్మును చివరికంటాలాగి వచ్చిన డ్రైవర్ బస్సును బయలుదేరదీశాడు.

"ఏమయ్యా నాలుగు రూపాయల టికెట్ కోసం వందనోటిస్తే ఎలా?"

ఒకవైపు ప్రయాణీకులను అరుస్తూనే వెనకనుండి టికెట్లు ఇస్తూ అందరినీ ముందుకు నెట్టుకొని వస్తున్నాడు కండక్టర్.

ఈ విషయాలతో తనకెంతమాత్రం సంబంధంలేనట్లుగా పట్టణ పొలిమేరలు దాటి పల్లెటూరి వైపు దారిపట్టి రోడ్డుపాడువునా మోకాటిలోతు గుంతల్లో పడుతూలేస్తూ, పరుగులు తీస్తోంది బస్సు. ఆ కుదుపులకు నిల్చుని వున్న ప్రయాణీకులు ఒకరిపై మరొకరు పడుతూ నానా అవస్థలు లోనవుతున్నారు. వారితోపాటుగా సీటు దొరకని సుబ్బారావు పరిస్థితి కూడా అలాగే వుంది.



## ప్రియాంక కొత్త అవతారం

లవ్ స్టోరీ సినిమాలలో నటించడం ప్రియాంక చోప్రాకు కొత్త కాకపోయినా 'లవ్ స్టోరీ 2050' మాత్రం తనకు సరికొత్త అనుభూతిని మిగిల్చిందని ప్రియాంక చెబుతోంది. అషతోష్ గోవర్కర్ సినిమా 'లవ్ స్టోరీ 2050'లో హర్మాన్ బవేజా సరసన ప్రియాంక నటించింది. హర్మాన్ సహ నటుడే కాదు నాకు మంచి స్నేహితుడు కూడా అని ప్రియాంక చెపుతోంది. "నేను నటించిన సినిమాలు అన్నింటిలో ఈ సినిమా చాలా విభిన్నమైనది. ఇందులో ప్రేమ, కామెడీ సమపాళ్లల్లో వున్నాయి. ఇలాంటి సినిమా నేను ఇంతకు ముందు చేయలేదు. భారతీయ సినిమాలో ఇంత వరకూ ఇలాంటి స్త్రీ పాత్ర రాలేదు. ఇదే మొదటి సారి" అని కూడా చెబుతోంది.

ఎదురుగా వస్తున్న సైకిల్ వాడిని తప్పించబోయి డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో అతలాకుతలమైనట్లుగా ఒకరిపై మరొకరు పడడంతో చంటిపిల్లని ఎత్తుకొని నిల్చుని అవస్థలు పడుతున్న తన భార్య దుస్థితిని గమనించిన ఓ వ్యక్తి తనకు అడ్డుగా వున్న వారందరిని త్రోసుకుంటూ డ్రైవర్ సీటు వెనుక భాగంలో వున్న సీటువద్దకు చేరుకున్నాడు.

"ఏమండీ ఈ సీట్లు మహిళలకోసం కేటాయించినవికదా? వాళ్ళు నిల్చుని వుండగా మీరెలా కూర్చున్నారు?" ఆ వ్యక్తి కాస్తంత కోపంగా ప్రశ్నించడంతో ఆ సీట్లో కూర్చొనివున్న వ్యక్తులు ఏరకమైన సమాధానం చెప్పే అవకాశం లేక తాము నిల్చొని సీటు ఖాళీ చేశారు.

దీంతో చంటిపిల్లని ఎత్తుకొని వున్న మహిళతో పాటుగా మరో ఇద్దరు ఆడవాళ్ళు అక్కడ సెటిలయ్యారు.

మగవాళ్ళు కూర్చొనివున్న 'రిజర్వ్‌డ్ ఫర్ లేడీస్' అని ఉన్న సీట్లన్నీ కూడా అలాగే ఖాళీ అవుతాయని నిల్చొనేవున్న మరికొందరు ఆడవాళ్ళు ఆశించారే కాని తమనెవ్వరూ ప్రశ్నించకపోవడంతో మగవాళ్ళు అలాగే కూర్చుండిపోయారు.

చంకలోని చేతికర్ర అసరాతో ఎంతోకష్టంగా నిల్చునివున్న సుబ్బారావు కూడా అడగనిదే అమ్మైనా పెట్టదన్న విషయాన్ని గుర్తించిన వాడిలా చట్టపరంగా తనకు లభించిన హక్కును డిమాండ్ చేస్తే తప్ప ప్రయోజం పొందలేమన్న విషయం మహిళల సీట్ల విషయంలో రుజువుకావడంతో 'వికలాంగులకు మాత్రమే' అని రాసివున్న సీట్ల వద్దకు మెల్లగా చేరుకొని "ఏమండీ ఈ సీటు మాలాంటి వాళ్ళకోసమే కదా, కుదుపుల కారణంగా కర్ర సహాయంతో నిల్చోలేకున్నా, కాస్తంత సర్దుకుంటే నేను కూర్చుంటా" అన్నాడు.

ఆ సీటులో కూర్చొనివున్న వాళ్ళు సుబ్బారావు వైపు ఎగాదిగా చూసి తమను కాదన్నట్లుగా మొహాలు అవైపుకు మళ్ళించుకున్నారు.

సుబ్బారావు మళ్ళీ మరోసారి అడిగాడు, ఈసారి అభ్యర్థించినట్లుగాక తన హక్కును పొందాలన్న ముఖ్యఉద్దేశాన్ని మాటల్లో వ్యక్తీకరిస్తూ.

"ఏరా కుంటోడా బిగ్గరగా నోరు చేసుకొని అరిస్తే వాళ్ళలాగే మేము కూడా బెదిరిపోయి సీటు ఖాళీ చేస్తామనుకున్నావట్రా" అంటూ సీట్లో కూర్చొనివున్న ముగ్గురిలో ఒకడు లేచి నిల్చొని సుబ్బారావు మెడపై చేయివేసి బలంగా త్రోశాడు.

ఆ వ్యక్తి నోరు తెరవడంతోనే సారావాసన గుప్పుమనడంతో ఆ వాసన భరించలేని కొంతమంది అప్రయత్నంగా ముక్కు మూసుకున్నారు.

ఏ మాత్రం ఊహించని ఈ హఠాత్పరిణామానికి తట్టుకొని నిలదొక్కుకోలేని సుబ్బారావు తన వెనుకగా వున్న ప్రయాణీకులపై ఒరిగిపోయాడు. చంకలోని చేతికర్ర ఓవైపు పడిపోగా బస్సుకుదుపుకు మరోవైపు పడిపోయిన కళ్ళజోడుపై ఎవరో ప్రయాణీకుడు కాలు పెట్టడంతో అదిపూర్తిగా విరిగిపోయింది.

తమపై ఒరిగిపోయిన సుబ్బారావుపై "అయ్యో పాపం" అంటూ జాలి కురిపించి చెయ్యి అసరాగా ఇవ్వడంతో మళ్ళీ లేచి నిల్చున్నాడు.

"అతను అడిగింది వాస్తవమే కదా, వికలాంగులకు కేటాయించిన సీట్లో కూర్చునే అవకాశం వారికే ఇవ్వాలి కదా?" నిల్చునివున్న ప్రయాణీకుల్లో ఎవరో ప్రశ్నించాడు.

"ఎవడురా చట్టాలు మాట్లాడుతోంది? మీ రూల్స్ మా ముందుకు వచ్చి మాట్లాడండి కొడకల్లారా తెలుస్తుంది" ఈసారి ముగ్గురూ లేవడంతో ఈరాద్ధాంతం తమకెందుకులెమ్మని ఎవరికి వారే

సర్దుకున్నారు.

ఓ రెండు నిమిషాలు అనంతరం కాస్తంత ఊపిరి పీల్చుకొన్న సుబ్బారావు మెల్లగా కూడబలుక్కున్నట్లుగా మళ్ళీ ''సీటు ఇవ్వమని అడిగినందుకు అలా ప్రవర్తించడం ఏం సబబండీ?'' అని ప్రశ్నించాడు.

''ఏందిదోయ్ కుంటోడా ఒక్కసారి చెబితే అర్థం కానట్లుందే, నీ పని ఇలాకాదంటూ'' బలంగా పొట్టలో తన్నాడు కళ్ళలో మరింత కర్కశత్వాన్ని ప్రదర్శిస్తూ.

కడుపులో ప్రేగులు ఉండచుట్టుకుపోయినట్లుగా బాధతో మెలికలు తిరుగుతూ మరోసారి ప్రయాణీకుల మీదకు ఒరిగిపోయాడు సుబ్బారావు. ఈలోగా తాము దిగాల్సిన స్టేజీ రావడంతో ఆ ముగ్గురూ బస్సు దిగివెళ్ళిపోయారు.

తాము జోక్యం చేసుకొంటే త్రాగుబోతులు తమను కూడా చితకబాది మరోసారి ఆ రూట్లో రానిచ్చేలా లేరని డ్రైవరు కండక్టర్లు తమకేమీ పట్టనట్లుగా ఉండిపోయారు.

గుండెల్లో కాస్తంత నొప్పిగావున్నట్లు బాధ పడుతున్న సుబ్బారావు వాలకాన్ని గమనించి ఛాతీపై మెల్లగా చేత్తో రుద్దుతూ వాటర్ బాటిల్‌లోని నీటిని మొహంపై చల్లి ఓ ప్రయాణీకుడు అసరా ఇవ్వడంతో మెల్లగా లేచి త్రాగుబోతులు దిగగా ఖాళీ అయిన సీటుపై జారగిలబడ్డాడు సుబ్బారావు.

మరో పదినిమిషాల తర్వాత వచ్చిన స్టేజీలో తాను కూడా దిగిపోయాడు ఆసరా ఇచ్చి లేపి కూర్చోబెట్టిన ప్రయాణీకుడు.

కాస్తంత తెప్పరిల్లుకున్న సుబ్బారావు జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకువస్తుండగా ఊడిపోయిన చొక్కాబొత్తాలు సవరించుకుంటూ ఎందుకనో షర్టుజేబులో చెయ్యిపెట్టుకున్నాడు. ఒక్కసారిగా గుండె ఝల్లుమంది.

కట్నంసొమ్ములో భాగంగా వియ్యంకుడికి ఇచ్చేందుకు తెస్తున్న యాభైవేల రూపాయల వెయ్యి నోట్ల బొత్తి చొక్కాలోపలి జేబులో నుండి ఎక్కడో జారిపోయినట్లుగా గుర్తించాడు.

గొంతు తడారిపోయినట్లు, ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి.

తను రెండుసార్లు క్రిందపడిపోయినప్పుడు జేబులో నుండి జారిపోయుంటుందని భావించి అన్ని వైపుల వెతికాడు. ఎక్కడా కనిపించలేదు.

సుబ్బారావు ఆదుర్దా గమనించిన ఒకరిద్దరు ప్రయాణికులు విషయమేమిటని ప్రశ్నించారు.

వియ్యంకుడికి ఇవ్వడానికి తెస్తున్న కట్నం సొమ్ము గురించి, ప్రస్తుతం జేబులో డబ్బు లేకపోవడాన్ని, కట్నం సొమ్ము సకాలంలో చేతికి అందకుంటే కూతురి పెళ్ళి ఎక్కడ వాయిదా పడుతుందోనన్న ఆందోళనను వ్యక్తం చేశాడు.

సొమ్ము పోయిన కారణంగా ఉట్టిచేతులతో వియ్యంకుడిని కలవలేని తన అసహాయత గురించి చెప్పి జేబులో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో కనీసం తాను మళ్ళీ తన ఊరు చేరుకునేందుకు అవసరమైన ఛార్జీల సొమ్మైనా సహాయం చేయమని అర్థించాడు.

ఎవరో ఒక వ్యక్తి చేతిలో వందనోటు పెట్టడంతో పాటుగా ఎదురు వస్తున్న తిరుగు బస్సులో ఎక్కించి జాగ్రత్తగా ఊరు చేరుకొమ్మని చెప్పాడు. ఊరు చేరుకుంటే పెళ్ళి గురించి మళ్ళీ నిదానంగా ఆలోచించుకోవచ్చునని సలహా కూడా ఇచ్చాడు.

సీటు విషయంలో జరిగిన గొడవ, సొమ్ము పోయిన విషయాల గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా జరగబోయేది ఏమిటో అర్థం కాగా రాత్రి ఏడు గంటల ప్రాంతంలో మళ్ళీ మధ్యాహ్నం బస్సుకోసం ఎదురుచూసిన నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండుకు చేరుకుని తమ ఊరికి వెళ్ళే బస్సు గురించి వాకబు చేశాడు.

పది నిమిషాల క్రితమే వెళ్ళిపోయినట్లుగా సమాధానం లభించింది.

ఆ ఊళ్ళో తెలిసినవాళ్ళు ఎవ్వరూ లేకపోవడంతో పాటుగా కనీసం లాడ్జీలోనైనా ఉండేందుకు అవసరమైన డబ్బు లేనందున ఆ రాత్రికి బస్టాండునే ఆశ్రయించక తప్పదనుకున్నాడు.

ఓ వైపు డబ్బు పోయిన బాధ, మరోవైపు బస్సులో జరిగిన సంఘటనతో ఆవేదనకు తోడుగా ఉదయం నుండి ఏమీ తినకపోవడంవల్ల కలిగిన నీరసంతో తాను మధ్యాహ్నం కూర్చొనివున్న బెంచీపై మెల్లగా తలవాల్చి కళ్ళు మూసుకున్నాడు.

బస్టాండు పరిసరాల్లోని రద్దీ కాస్తంత తగ్గుముఖం పట్టింది. ప్లాట్‌ఫారాల వద్ద అక్కడక్కడ ఏర్పాటు చేసిన టెలివిజన్‌ల నుండి వస్తున్న కార్యక్రమాలను తిలకిస్తున్నారు ప్రయాణీకులు.

వాణిజ్య ప్రకటనల అనంతరం ఓ ప్రైవేటు ఛానెల్‌లో వార్తలు ప్రారంభం కావడంతో ఆవైపు యథాలాపంగా దృష్టి సారించాడు సుబ్బారావు. టెలివిజన్ స్క్రీన్‌పై దృశ్యాలు ఒక్కొక్కటిగా మారుతున్నాయి.

ఏదోప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న రవాణాశాఖా మంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నాడు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేందుకు చేసిన కృషిని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్టాండుల్లోనూ 'త్రాగునీరు' వంటి సౌకర్యాలను కల్పించేందుకు చేపట్టిన చర్యలను, అందుకోసం ఖర్చుపెట్టిన కోట్లాది రూపాయల నిధులను గణాంకాలతో సహా వివరిస్తున్నాడు.

ప్రత్యేకించి మహిళలకు, వికలాంగులకు కేటాయించిన సీట్లలో వారే కూర్చొని ప్రయాణించే వీలుగా 'రిజర్వేషన్లు' ఖచ్చితంగా అమలు జరిగేలా చూస్తున్నామని, బస్సుల్లోనూ, బస్టాండుల్లోనూ జేబుదొంగలను నివారించేందుకు నిఘా పోలీసులను మరింతగా పెంచినట్లు ఏకరువు పెడుతున్నాడు.

మంత్రివర్యుడి ఉపన్యాసం వింటున్న కొద్దీ సుబ్బారావుకు ఒళ్ళంతా తేళ్ళు, జెర్రులు ప్రాకినట్లయింది.

ఉదయం నుండీ బస్టాండులోనూ, బస్సులోనూ, తనకు ఎదురైన అనుభవాలు, సీటుదొరక్క పడిన కష్టం, అవమానంతోపాటుగా, తనపై జాలి ప్రకటించి చేతి ఆసరాతో ఊతమిచ్చినట్లుగా నటించి జేబులోని సొమ్మును లాఘవంగా తస్కరించిన జేబుదొంగ, వీళ్ళంతా గుర్తుకు రాగా బిగ్గరగా అరిచి స్పృహ తప్పిపడిపోయాడు కార్గిల్ యుద్ధంలో శత్రువులను తరిమికొట్టి వీరసైనికుడిగా గుర్తింపు పొందిన సుబ్బారావు ఉరఫ్ నేటి కలియుగ ప్రజాస్వామ్యంలో ప్రతీచోటా నిలువుదోపిడీకి గురయ్యి పరాజితుడైన మాజీ సైనికోద్యోగి సుబ్బారావు.

*



## బిజీ అవుతున్న సంధ్య

పవన్ కళ్యాణ్ 'అన్నవరం' సినిమా చూసిన వారికి అందులో చెల్లెలుగా నటించిన సంధ్య గుర్తుండే వుంటుంది. ఆ సినిమా సంధ్యకు మంచి పేరు తెచ్చినా తెలుగులో పెద్దగా సినిమాలు రాలేదు. ఆ సినిమా తరువాత తెలుగు తెరకు దూరంగా వున్న సంధ్య ఇపుడు 'లేచిపోదామా' ద్వారా మళ్ళీ ప్రత్యక్షం కాబోతోంది. కన్మణి దర్శకత్వంలో రూపొందుతున్న 'లేచిపోదామా' సంధ్యకు హీరోయిన్‌గా తొలి తెలుగు చిత్రం కాబోతోంది. తమిళం నుంచి తెలుగులోకి డబ్ చేస్తున్న మరో ప్రేమకథా చిత్రంలో కూడా సంధ్య ముఖ్య పాత్రను పోషిస్తోంది.